సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 3 । మార్చి । 2023



### గ్యాస్ సిలెండర్ల లారీకి మంటలు

గురువారం మొగల్తూరు రోడ్డు కొండావారి పాలెం సమీపంలో గ్యాస్ సిలెండర్ల లారీ టైరుకు మంటలు అంటుకోగా.. అగ్నిమాపక శాఖ సిబ్బంది అదుపుచేసింది. 8లో



### గంజాయి గుట్టురట్టు

నరసాపురంలో తొమ్మిది మంది గంజాయి విక్రేతలను అరెస్టు చేసి 24 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు పరారీలో ఉన్నారు. 8లో

### చెరువులో విష ప్రయోగం



ఆకివీడు మండలం అజ్జమూరులో ఓ రైతు చెందిన చెరువు విషప్రయోగం జరగడంతో రూ.15 లక్షల విలువైన రొయ్యలు చనిపోయాయి. చెరువులో దాదాపు నాలుగు లక్షల మేర రొయ్య పిల్లల్ని వేసి సాగు చేస్తున్నారు. 8లో

## న్యూస్‌రీల్

### మహిళా దినోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



మహిళా దినోత్సవాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

**భీమవరం(ప్రకాశం చౌక్):** ఈ నెల 3 నుంచి 8 వరకు శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ మహిళ దినోత్సవ వేడుకల బ్రోచర్‌ను క్యాంప్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ పి.ప్రశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంపూర్ణ సాధికారితతోనే సమాజ ప్రగతి అని, మహిళలు కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో మహోన్నత పోరాటం సాగించారన్నారు. 34 ఏళ్లుగా ప్రపంచ మహిళా దినోత్సవాన్ని వారోత్సవాలుగా భీమవరంలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 3న చినరంగనింపాలెం మున్సిపల్ హైస్కూల్లో ఈ వేడుకలను ప్రారంభిస్తున్నామన్నారు. 4 నుంచి 7 వరకు వివిధ పాఠశాలలు, కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలపై సదస్సు, బాలికలకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తామన్నారు. కంతేటి వెంకటరాజు, ఇందుకూరి ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

### పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు




పోలింగ్ సిబ్బందికి శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జేసీ పి.అరుణ్‌బాబు

**ఏలూరు(మెట్రో):** ఓటర్లు తమ ఓటుహక్కును గోప్యంగా వినియోగించుకునేలా ఎన్నికల పోలింగ్ సిబ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియపై సిబ్బంది పూర్తి స్థాయిలో శిక్షణ పొంది ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బంది ముందురోజు పోలింగ్ స్టేషన్‌లోనే ఉండాలని, మరుసటి రోజు పోలింగ్ ప్రారంభ సమయానికి గంట ముందుగానే పోలింగ్ స్టేషన్‌ను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను ముందుగానే పరిశీలించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఆర్డీఓలు పెంచల్ కిశోర్, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

### కొల్లేరు గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ

**ఏలూరు టౌన్:** ఏలూరు జిల్లాలోని కొల్లేటి గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. కొల్లేరు ప్రాంత నాయకుడు జయమంగళ వెంకట రమణకు ఎమ్మెల్సీ సీటు కేటాయించటం ఎంతో గర్వకారణం అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఆళ్ల నానిని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకట రమణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆళ్ల నాని మాట్లాడుతూ కొల్లేరు గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారన్నారు. జయమంగళ మాట్లాడుతూ ముఖ్యమంత్రికి, నానికి కృతజ్ఞతలు తెలిపారు.

### అప్రైజర్ చేతివాటం ఘటనలో విచారణ

**జంగారెడ్డిగూడెం:** స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయంలో అప్రైజర్ ఎం.రామశేషాచార్యులు చేతివాటం ఘటనలో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక బ్రాంచి కార్యాలయానికి ఖాతాదారులు కుదువపెట్టిన బంగారాన్ని పరిశీలించేందుకు ఒక బృందాన్ని పంపినట్లు ఏజీఎం జేజేశ్వర రావు తెలిపారు. ఎంతమంది బంగారాన్ని కుదువ పెట్టారు. కుదువ పెట్టిన బంగారం పరిస్థితులను బృందం పరిశీలిస్తుందన్నారు.

# గెలుపు లాంఛనమే

- 1,105 ఓట్లలో 879 వైఎస్సార్‌సీపీ ఓట్లే
- మొదటి ప్రాధాన్యతలో 336 ఓట్లు వస్తే ఎమ్మెల్సీగా గెలుపు ఖాయం
- విస్తృతంగా పార్టీ అభ్యర్థుల ప్రచారం



నరసాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్ర నాథ్, చిత్రంలో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు (ఫైల్)

**సాక్షి ప్రతినిధి, ఏలూరు:** స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు లాంఛనం కానుంది. ఖాళీ అయిన రెండు స్థానాల్ని అధికార వైఎస్సార్‌సీపీ పూర్తి మెజార్టీతో దక్కించుకోనుంది. స్థానిక సంస్థల్లో 85 శాతం స్థానాలు కైవసం చేసుకుని ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీ పార్టీ బలంగా ఉంది. ఓట్ల సంఖ్యా బలంతో జిల్లాలో రెండు స్థానాలు సునాయాసంగా కైవసం చేసుకోనుంది. వాస్తవానికి గెలుపుకు సరిపడా ఓట్లు టీడీపీకి లేనప్పటికీ కుల రాజకీయాలతో పాటు ఇతర సమీకరణాలకు తెరలేపారు. నలుగురు ఇండిపెండెంట్లను బరిలో నిలిపారు. బరిలో ఉన్న నలుగురు కూడా టీడీపీ సానుభూతిపరులు. ఆ పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులే. అధికార వైఎస్సార్‌సీపీ శాసన మండలి అభ్యర్థులుగా వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమలో వారు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంతవరకు ఐదు నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు.

**మార్చి 13న ఎన్నిక :** ఉమ్మడి పశ్చిమగోదావరిలో ఈ నెల 13న స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుల ఎన్నిక ప్రక్రియ జరగనుంది. ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 1,105 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులున్నారు.

వీరిలో 856 మంది ఎంపీటీసీలు, 48 మంది జెడ్పీటీసీలు, ఏలూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, మున్సిపాల్టీల్లోని కౌన్సిలర్లు కలిపి 180 మంది, ఎక్స్‌అఫీషియో సభ్యులు 21 మంది కలుపుకుని 1105 మంది ఓటర్లు ఉన్నారు. 856 మంది ఎంపీటీసీల్లో 7 స్థానాలు ఖాళీగా ఉండటంతో, 849 మంది ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 13న ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహించడానికి వీలుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐదు డివిజన్లో ఎంపీడీఓ కార్యాలయాల్లో ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**5 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు**

ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో 10 మండలాలు, ఏలూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు మొత్తం 250 మంది, జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో 10 మండలాలు, జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీ కలుపుకుని 183 మంది ప్రజాప్రతినిధులు, కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో 9 మండలాలు, రెండు మున్సిపాల్టీలు కలుపుకుని మొత్తం 242 మంది ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నర్సాపురం ఎంపీడీఓ కార్యాలయంలో 10 మండలాలు, నర్సాపురం మున్సిపాల్టీ కలుపుకుని మొత్తం 228 మంది ప్రజాప్రతినిధులు, భీమవరం ఎంపీడీఓ కార్యాలయంలో 9 మండలాలు, ఆకివీడు నగర పంచాయతీ కలిపి 202 మంది ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు.

**879 ఓట్లు వైఎస్సార్‌సీపీకే**

మొత్తం 1,105 ఓట్లకు గాను మొదటి ప్రాధాన్యతలో 336 ఓట్లు దక్కించుకున్న అభ్యర్థి గెలుపొందుతారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి తిరుగులేని బలం ఉంది. 48 జెడ్పీటీసీలకు గాను 46 జెడ్పీటీసీలు వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. 856 ఎంపీటీసీలకు 633 మంది వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందినవారే. 185 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులకు గాను 154 వైఎస్సార్‌సీపీ వారే కావడంతో పార్టీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపు సునాయాసం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ అభ్యర్థులు ఏలూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, నర్సాపురం, పాలకొల్లు, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు.

## సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కలగంపూడిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి, ముదునూరి ప్రసాదరాజు

**యలమంచిలి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. చించినాడ-దిగమర్రు జాతీయ రహదారి వల్ల ట్రాఫిక్‌కు ఏ విధమైన అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 5న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహానికి సీఎం జగన్ హాజరుకానున్న నేపథ్యంలో గురువారం హెలిప్యాడ్, కల్యాణ వేదిక ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు 3వ తేదీ సాయంత్రానికి పూర్తి కావాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి కల్యాణ వేదిక వరకు పూర్తిగా శానిటేషన్ చేయించడంతో దారి పొడవునా పూలమొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. బారికేడ్స్ ఏర్పాటుతో పాటు పార్కింగ్‌కు రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఇన్‌చార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, డీటీడీసీ బాబు, ఇనుకొండ రవి, డీఎస్పీ రవి మనోహరాచారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

- పీడీ యాక్ట్, నగర బహిష్కరణ అమలు
- బాధితులకు ప్రత్యేక కౌన్సెలింగ్
- ఏలూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు



**ఏలూరు టౌన్:** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి రవాణా, విక్రయాలపై వినూత్నమైన రీతిలో ప్రత్యేక ప్రణాళికను పోలీస్ శాఖ అమలు చేయబోతుంది. గంజాయి మాఫియాను నిరోధించటమే కాకుండా సరికొత్త రీతిలో నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో విద్యార్థులే టార్గెట్‌గా గంజాయిని విక్రయించే వారిని గుర్తించే పనిలో పోలీస్ అధికారులు, నిఘా వర్గాలు నిమగ్నమయ్యాయి. వారం రోజుల్లో ఏలూరు రేంజ్ పరిధిలో భారీఎత్తున గంజాయి విక్రయాలు చేసే ముఠాలను అరెస్టులు చేసేందుకు పోలీస్ పక్కా వ్యూహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం**

ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. రాష్ట్రంలో గంజాయి నిరోధానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ ఆదేశాలతో గంజాయిని కూకటి వేళ్ళతో పెకిలించేలా పోలీస్ శాఖ యుద్ధం చేసేందుకు సన్నద్ధమవుతోంది. ఎక్కడా రాజీపడే అవకాశం లేకుండా నిత్యం పర్యవేక్షణ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లో గంజాయిని వ్యక్తిగతంగా విద్యార్థులు, యువతకు విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇప్పటికే వ్యక్తిగతంగా స్కూల్స్, ఇంటర్ కాలేజీలు, ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలే లక్ష్యంగా విద్యార్థులకు గంజాయిని అలవాటు చేసే వ్యక్తులను టార్గెట్ చేస్తూ వారిని గుర్తిస్తున్నాం. ఏలూరు రేంజ్ పరిధిలో భారీ సంఖ్యలో గంజాయి విక్రయించే వారిని గుర్తించాం. వారం రోజుల్లో వారిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేశాం.

**పీడీ యాక్ట్‌లు, నగర బహిష్కరణలు**

ఏలూరు రేంజ్ పరిధిలో గత మూడేళ్ల కాలంలో గంజాయి రవాణా, విక్రయాల కేసుల్లో నిందితుల్లో చాలామందిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. అనేకసార్లు గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడి మళ్ళీ అదే నేరాలకు పాల్పడుతున్న నేరస్తులపై కఠినంగా వ్యవహరించబోతున్నాం. తొలుత పీడీ యాక్ట్‌లు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేశాం. ఇంకా నేరాలకు పాల్పడుతూ కేసులు నమోదైతే నగర, పట్టణ బహిష్కరణకు చర్యలు తీసుకుంటున్నాం. ఏలూరు, భీమవరం, రాజమండ్రి, విజయవాడ, కాకినాడ, ఇలా అనేక పట్టణాలు, నగరాల్లోని గంజాయి రవాణా చేసే నేరస్తులపై కఠిన వైఖరి ఉంటుంది. ఇక గంజాయి, డ్రగ్స్ బాధితులకు బాసటగా నిలిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి అలవాటును దూరం చేసేందుకు వైద్యచికిత్సలు, కౌన్సిలింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఐజీ పాలరాజు చెప్పారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4,695 మంది హాజరు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల నాలుగో రోజున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 4,695 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు గురువారం 60 కేంద్రాల్లో 4322 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4258 మంది హాజరయ్యారు. మరో 64 మంది గైర్హాజరయ్యారు. 17 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 490 మంది హాజరు కావాల్సి ఉండగా 437 మంది హాజరయ్యారు. 53 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

## బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**పాలకొల్లు అర్బన్:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అధికారుల ఆదేశాలు లెక్కచేయకుండా బాల్య వివాహాలు జరిపిస్తే తల్లిదండ్రులు శిక్షార్హులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం కాపవరంలో బాల్య వివాహానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో గురువారం అధికారులు అప్రమత్తమై బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలికకు మరో రెండు రోజుల్లో వివాహం జరగనున్న నేపథ్యంలో ఆమెకు మైనార్టీ తీరిన తరువాత వివాహం జరిపిస్తామని తల్లిదండ్రుల నుంచి ఒప్పంద పత్రం తీసుకున్నారు. చిన్నవయస్సులో వివాహాలు జరిపించడం వలన యువతికి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, మాతృ, శిశుమరణాలు సంభవిస్తాయని వివరించి, వివాహాన్ని వాయిదా వేయించారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ కాటంరాజు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గంజాయి అమ్మకాలపై కఠిన చర్యలు

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలో గంజాయి అమ్మకాలు జరిగే ప్రాంతాలన్నీ తమ నిఘాలో ఉన్నాయని గంజాయి అమ్మకాలు జరిపినా, తరలించిన కఠినమైన చర్యలు తీసుకుంటామని తాడేపల్లిగూడెం ఎస్ఈబీ సీఐ బి.సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలో గురువారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్, రైల్వే పార్శిల్ కార్యాలయం, బస్సు స్టేషన్, బస్సు స్టేషన్ పార్శిల్ కార్యాలయం, బస్సులు, ఆటోలు తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను ఆపి గురువారం ఎస్ఈబీ పోలీసులు తనిఖీ చేశారు. అనుమానితుల వద్దకు వెళ్ళి వారి బ్యాగ్‌లను పరిశీలించారు. పార్శిల్ కార్యాలయం సిబ్బందికి అవగాహన కల్పించి, పార్శిల్స్‌లో అనుమానులు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సీఐ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం చేపట్టిన డ్రగ్ రహిత ఏపీలో భాగంగా ఎస్పీ రవి ప్రకాశ్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ రవి కుమార్, సూపరిండెంటెంట్ భార్గవ్ ఆదేశాలు మేరకు సిబ్బందితో పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగం చేయకుండా కళాశాలలో సైతం విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నట్లు వెల్లడించారు. యువత ఆరోగ్యం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వారికి వెల్లడిస్తూ మంచి మార్గాలు వివరిస్తున్నట్లు తెలిపారు. అవగాహన కార్యక్రమాలలో భాగంగా విద్యార్థి కమిటీలు ఏర్పాటు చేస్తామని, వారికి కనిపించేలా హోర్డింగ్‌లు పెట్టినట్లు తెలిపారు. యువత గంజాయి వంటి నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని, అమ్మకాలు, వినియోగించే ప్రాంతాలపై నిరంతరం నిఘాతో పాటు దాడులు ఉంటాయన్నారు. డ్రగ్స్, గంజాయి నేరాలపై సమాచారం తెలిస్తే డ్రగ్ టోల్ ఫ్రీ నెంబర్ 14500, తాడేపల్లిగూడెం ఎస్ఈబీ స్టేషన్ ఫోన్ నెంబర్ 9440902433కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.



గూడెం బస్సు కాంప్లెక్స్ పార్శిల్ సర్వీస్ వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ పోలీసులు

# భీమవరం మాస్టర్ ప్లాన్ సిద్ధం

- నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ
- రెండు 60 అడుగుల రింగ్ రోడ్ల నిర్మాణం




భీమవరం మున్సిపాలిటీలో ప్రదర్శించిన నూతన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్

**భీమవరం(ప్రకాశం చౌక్):** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రెండో పెద్ద పట్టణంగా ఉన్న భీమవరం శరవేగంగా విస్తరిస్తుంది. అయితే సరైన ప్లానింగ్ లేకపోవడంతో రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు, మౌలిక వసతుల లేమి ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుకు రంగం సిద్ధమైంది. 35 ఏళ్ల తర్వాత ఈ నూతన మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నారు.

1987లో మొదటి మాస్టర్ ప్లాన్ తయారు చేయగా ఇప్పటికీ దాన్నే కొనసాగిస్తున్నారు. సాధారణంగా ఇప్పటికే రెండు మాస్టర్ ప్లాన్‌లు కాలం పూర్తి చేసుకుని మూడో మాస్టర్ ప్లాన్ అమలు జరిగే పరిస్థితి ఉండాలి. అయితే తొలి ప్లాన్ ఇప్పటికీ అమలవుతోంది. ప్రస్తుతం నూతన మాస్టర్ ప్లాన్ సిద్ధం కావడంతో ఏలూరు అర్బన్ డెవలమెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నూతన మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌ను గత నెల 21న భీమవరం మున్సిపాలిటిలో ప్రదర్శనకు ఉంచారు. ఇందులో విలీన గ్రామాలైన రాయలం, చినఅమిరం, తాడేరు, కొవ్వాడ అన్నవరంను కలుపుతూ కూడా ప్లాన్ సిద్ధం చేశారు. దీనిపై నెల రోజుల పాటు అభ్యంతరాలకు అవకాశం కల్పించారు.

**ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కృషితో**

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ భీమవరం పట్టణం అభివృద్ధి, విస్తరణపై దృష్టిపెట్టారు. విలీన గ్రామాలు కూడా ఉండడంతో పట్టణానికి నూతన మాస్టర్ ప్లాన్ అవసరం గుర్తించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి కొత్త మాస్టర్ ప్లాన్‌కు కృషి చేశారు. మాస్టర్ ప్లాన్ తయారీకి సంబంధించి రూ 30 లక్షల నిధులను మంజూరు చేశారు. మొదట స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ, తర్వాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ ఆఫ్ ఇండియా విజయవాడ ఆధ్వర్యంలో సర్వే, మాస్టర్ ప్లాన్ తయారు చేశారు.

### అభివృద్ధికి దోహదం



పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలు అధిగమించడం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని నూతన మాస్టర్ ప్లాన్ కోసం కృషి చేశాం. సుమారు 35 ఏళ్ల క్రితం రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇంతవరకు అమలు చేశాం. కొత్త మాస్టర్ ప్లాన్ అవసరమని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ప్రభుత్వం నుంచి కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించడం కోసం రూ.30 లక్షల నిధులు మంజూరు చేయించారు. మాస్టర్ ప్లాన్‌పై అభ్యంతరాలు, సూచనలు సలహాలు స్వీకరిస్తున్నారు. అతి త్వరలోనే కొత్త మాస్టర్ ప్లాన్ అమలులోకి తీసుకువస్తాం. నూతన మాస్టర్ ప్లాన్ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం, వేగంగా ప్లాన్ సిద్ధం చేయడం సంతోషం.

– గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్యే

### మాస్టర్ ప్లాన్ ముఖ్యాంశాలు

నూతన మాస్టర్ ప్లాన్ ద్వారా పట్టణంలో ముఖ్యంలో రెండు 60 అడుగుల రోడ్లు నిర్మించాలి. అందులో ఒకటి పీపీ రోడ్డు నుంచి భీమవరం -నర్సాపురం రోడ్డుకు అవుటర్ రింగ్ రోడ్డు, మరొకటి విస్సాకోడేరు లేవుట్ నుంచి గునుపూడి జగనన్న లేవుట్‌కు అనుసంధనం చేస్తూ ఇన్నర్ రింగు రోడ్డు ప్రతిపాదించారు. గత 30 అడుగుల రోడ్లను అలాగే ఉంచి 40 అడుగుల రోడ్లను 60 అడుగులకు ప్రతిపాదించారు. పీపీ రోడ్డు(పాలకొల్లు టూ పామర్రు) 60 అడుగుల నుంచి 80 అడుగులకు ప్రతిపాదించారు. జువ్వలపాలెం రోడ్డును 80 అడుగుల యథాతథంగా చూపారు.

### మారనున్న పట్టణ విస్తీర్ణం

కొత్త మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్‌లో భూమి వినియోగ ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి. రెసిడెన్షియల్, కమర్షియల్, మిక్స్‌డ్, ఇండస్ట్రీయల్, వర్క్ సెంటర్, పబ్లిక్, సెమీ పబ్లిక్, పబ్లిక్ యుటిలైజ్, రిక్రియేషన్ ఓపెన్ స్పేస్, ట్రాన్స్‌పోర్టేషన్, అగ్రికల్చర్ యూజ్ జోన్లు, ప్రొటెక్టెడ్ యూజ్ జోన్లుగా విభజించారు. కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పట్టణ విస్తీర్ణం మారనుంది.పట్టణం 25.64 చదరపు కిలోమీటర్లు కాగా విలీన గ్రామాలైన రాయలం 4.179 చ.కి.మీ, తాడేరు 9.03, చిన అమిరం 4.82, కొవ్వాడ 2.23 చదరపు కిలో మీటర్లు కలిస్తే 45.899 చదరపు కిలోమీటర్లు కానుంది.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి

**హోం మంత్రి తానేటి వనిత**

**కొవ్వూరు:** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పార్టీ తరపున పోటీలో ఉన్న వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌ల విజయానికి కృషి చేయాలని హోం మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. పట్టణంలో క్యాంపు కార్యాలయంలో గురువారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు పార్టీ విధేయులుగా పనిచేయాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును కవురు శ్రీనివాస్‌కు, ద్వితీయ ప్రాధాన్యత ఓటును రవీంద్రనాథ్‌కు వేయాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ పరిశీలకుడు, ఎంపీ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు కీలకమైన కాపు సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటింగు విషయంలో పూర్తి అవగాహన కల్పిస్తామన్నారు. మరో అభ్యర్థి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న తమకు సముచిత స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సామాజిక సమతుల్యతను పాటిస్తూ జిల్లాలో కాపు, బీసీ వర్గాలకు న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కౌన్సిలర్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మానవత్వం చాటిన ఎమ్మెల్యే వాసుబాబు



రాచూరు వద్ద క్షతగాత్రుడిని ఆసుపత్రికి పంపిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

**ఉంగుటూరు:** రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఓ యువకుడిని ఆస్పత్రికి తరలించి తక్షణ వైద్యం అందేలా చర్యలు తీసుకుని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తన మానవత్వాన్ని చాటారు. వివరాలిలా ఉన్నాయి. కై కరంలో గురువారం నిర్వహించే గృహసారథుల శిక్షణ సమావేశానికి హాజరయ్యేందుకు ఎమ్మెల్యే వాసుబాబు వెళుతున్నారు, అదే సమయంలో కారు మోటారు సైక్లిస్టును ఢీకొని తల, కాలుకు తీవ్ర గాయాలతో ఉన్న యువకుడిని చూసి చలించిపోయారు. వెంటనే తన కారు ఆపి క్షతగాత్రుడికి సిబ్బందితో సపర్యలు చేయించి ధైర్యం చెప్పి వేరే కారులో తాడేపల్లిగూడెంలోని వైష్ణవి ఆసుపత్రికి తరలించి డాక్టర్‌తో మాట్లాడి తక్షణ వైద్యం అందించాలని కోరారు. దీంతో పలువురు ఎమ్మెల్యే సేవలను ప్రశంసించారు.

# తెగుళ్ల బెడద.. దూరం చేయండిలా

- దాళ్వా వరి సాగులో తెగుళ్లు
- నివారణకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

పాడిపంట

**నరసాపురం రూరల్:** నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో సార్వా వరి సాగులో అక్కడక్కడా జింక్ లోపంతో పాటు కాండం తొలిచే పురుగు, అగ్గితెగులు కనిపిస్తున్నాయి. అయితే వీటి ఉధృతి పెరగకుండా తెగులు సోకిన వెంటనే నివారణ చర్యలు పాటిస్తే పంట దిగుబడిపై ప్రభావం పడకుండా ఉంటుంది. వీలైనంత వరకు పురుగుమందుల వినియోగించకుండా పొలంబడిలో సూచించే సూచనలు లేదా వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలని అధికారులు చెబుతున్నారు. వేయాల్సిన ఎరువులు వేసినప్పటికీ జింక్ లోపం వల్ల మొక్క ఎదుగుదల లోపించి దుబ్బు చేయదు. పాత ఆకులపై తుప్పు రంగు మచ్చలు కనిపిస్తుంటాయి. మొక్కపై నుంచి మూడు లేదా నాలుగు ఆకులలో మధ్య ఈనె పాలిపోతుంది. ఇరు పక్కలా ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. దీని నివారణకు గాను ఎకరానికి జింకు సల్ఫేట్ 400 గ్రాముల మందును లేదా జింకు ఈడీటీఏ 21 శాతం లేదా 33 శాతం మందును 400 గ్రాముల మందును పిచికారీ చేయడం



జింక్‌లోపానికి గురైన వరి ఆకు



నివారణకు మందును పిచికారీ చేస్తున్న రైతు.

వల్ల ఈ తెగుళ్లను నివారింకోవవచ్చు.

**అగ్గి తెగులు**

ఆకులపై ముదురు గోధుమరంగు అంచుతో మధ్యలో బూడిద రంగు ఉండే నూలు కండె ఆకారపు మచ్చలు, ఆకులు ఎండి తగులబడినట్లు కనబడడం వల్ల ఈ తెగులును అగ్గితెగులు అంటారు. ఈ తెగులు వెన్ను, మెడ బాగంలో ఆశిస్తే వెన్ను విరిగి వాలిపోతుంది. దీనినే మెడ విరుపు అంటారు. ఈ తెగులు సోకడం వల్ల సగం నిండిన గింజలు, తాలు ఏర్పడతాయి. దీని నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు నత్రజని అందించే ఎరువులను తకువ మొతాదులో వాడిలి. అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి ట్రై సైక్లోజోల్ 75 శాతం మందును 0.6 గ్రాములు, లేదా ఐసో ప్రోథియోలిన్ 40 శాతం మందును 1.5మిల్లీ లీటర్లు మందును, లేదా కాసుగా మైసిన్ 3 శాతం మందును 2.5 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేయాలి. దీంతోపాటు తెగులును తట్టుకునేందుకు గట్లపైన కలుపును సకాలంలో నివారించాలి.

**కాండం తొలుచు పురుగు**

నారు మండి దశ నుంచి ఈనిక దశ వరకూ వరి పంటను కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉంది. పిలకలు తొడిగే దశలో ఆశిస్తే మొవ్వులు ఎండిపోయి చనిపోతుంది. పూత దశలో అయితే వెన్నులు తెల్ల కంకులుగా మారిపోయి నిరుపయోగంగా ఉంటుంది. చనిపోయిన కంకులను లాగితే సులువుగా బయటకు వస్తుంది.

దీని నివారణకు లీటరు నీటికి కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ 50ఎస్‌పీ మందును 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 20ఎస్‌పీ మందును 0.4 మిల్లీలీటర్ల మందును పిచికారీ చేయాలి. చీడపీడల ఉధృతిని పరిశీలించి అవసరాన్ని బట్టి 15 రోజుల వ్యవధిలో మరోసారి పైన సూచించన మందులను పిచికారీ చేసుకోవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వంతుల వారీ విధానం అమలులో ఉన్నందున రైతుల పొలాల్లో నీటి యాజమాన్యాన్ని పాటించడం వల్ల దిగుబడిని పెంపొందించుకోవచ్చును.

### వ్యవసాయాధికారుల సూచనల మేరకే



రైతులు ఏదైనా తెగులు, పురుగు గుర్తించిన వెంటనే రైతు భరోసా కేంద్రాన్ని లేదా వ్యవసాయాధికారులను గానీ సంప్రదించి వారి సూచనల మేరకే సంబంధిత మందులను వినియోగించాలి. ప్రస్తుతం వంతుల వారీ విధానం అమలు ఉన్నందున వంతు సమయంలో నీటి ఎద్దడి ఎదురైతే 08816–234197 నెంబరుకు సమస్యను వివరించి పరిష్కారం పొందవచ్చు.

– ఈదా అనిల్‌కుమారి, సహాయ వ్యవసాయ సంచాలకులు, నరసాపురం

### గ్యాస్ సిలిండర్ల లారీకి తప్పిన ముప్పు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**మొగల్తూరు:** జాతీయ రహదారిపై గ్యాస్ సిలెండర్ల లోడుతో వెళుతున్న లారీ టైరు నుంచి మంటలు రాగా, సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిమాపక శాఖాధికారి పి.రామ్మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడ నుంచి నరసాపురానికి గ్యాస్‌తో నిండి ఉన్న సిలిండర్ల లోడుతో ఓ లారీ గురువారం వెళుతోంది. ఉదయం 5 గంటల సమయంలో మొగల్తూరు రోడ్డులో కొండావారి పాలెం సమీపంలోకి వచ్చేసరికి లారీ వెనుక టైర్ నుంచి పొగ వాసన వస్తుండంతో డ్రైవర్‌కు అనుమానం వచ్చి వాహనాన్ని ఆపి పరిశీలిస్తుండగానే అంతలోనే మంటలు రేగాయి. దీంతో సమీపంలో ఉన్న స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్లు చేరుకుని మంటలను అదుపు చేశాయి. గ్యాస్ సిలెండర్లకు మంటలు చేరకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

### రొయ్యల చెరువులో విష ప్రయోగం



**ఆకివీడు:** అజ్జమూరులో ఓ రైతుకు చెందిన చెరువులో బుధవారం అర్ధరాత్రి జరిగిన విషప్రయోగంతో రూ.15 లక్షల విలువైన రొయ్యలు చనిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని దేవస్థానానికి చెందిన మూడున్నర ఎకరాలు రొయ్యల చెరువును నరహరిశెట్టి సురేష్ లీజుకు తీసుకుని రొయ్యల సాగు చేస్తున్నాడు. చెరువులో సుమారు మూడున్నర, నాలుగు లక్షల మేర రొయ్య పిల్ల వేసి సాగు చేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చెరువులో విషం కలపడంతో రొయ్యలు, చెరువులో ఉన్న ఇతర జీవాలు చనిపోయాయి. ఈ మేరకు రైతు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రాజారెడ్డి వివరించారు.

### ప్రైవేట్ కళాశాల వద్ద విద్యార్థుల ఘర్షణ

**సాక్షి, భీమవరం:** పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల వద్ద ప్రధాన రహదారిపై గురువారం విద్యార్థులు ఘర్షణకు దిగడంతో ప్రయాణికులు, తోటి విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. జూనియర్ విద్యార్థి మోటారుసైకిల్‌పై కూర్చుని ఉండగా సీనియర్ విద్యార్థి వచ్చి మోటార్ సైకిల్ దిగాలని చెప్పడమే గొడవకు కారణంగా చెబుతున్నారు. విషయం తెలిసిన వెంటనే కళాశాల యాజమాన్యం తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చి పోలీసులకు అప్పగించారు. దీనితో విద్యార్థులను విచారిస్తున్నట్లు టుటౌన్ సీఐ బి.కృష్ణకుమార్ చెప్పారు.

# 9 మంది గంజాయి విక్రేతల అరెస్టు

- 24.750 కిలోల గంజాయి స్వాధీనం
- జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ వెల్లడి

**నరసాపురం:** నరసాపురంలో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2.50 లక్షల విలువైన 24.750 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ చెప్పారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వీరవాసరం పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న చిరుద్యోగి కాగా, మరో వ్యక్తి, మైనర్ పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. కేసు వివరాలను గురువారం స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వెల్లడించారు. పట్టణంలోని జగంవారివీధిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్టుగా వచ్చిన సమాచారంతో నరసాపురం రూరల్ సీఐ వి.సురేష్‌బాబు, ఎస్సై సుధాకర్‌రెడ్డి సిబ్బందితో దాడి చేశారు. గంజాయిని మోటారుసైకిళ్లపై తరలించి, వేరే వ్యక్తులకు అమ్మడానికి సంప్రదింపులు జరుపుతున్న సమయంలో వారిపై ఆకస్మికంగా దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో 8 మంది నరసాపురానికి చెందిన వారే. పంజా సెంటర్‌కు చెందిన షేక్ హుస్సేన్, రాయిపేటకు చెందిన బందెల రోహిత్, చిన్నమసీదు సెంటర్‌కు చెందిన ఎండీ రషీద్, కొత్తకాలనీకి చెందిన ఆతకోట ఆనందకుమార్, 28వ వార్డుకు చెందిన గుబ్బల రమేష్, 26వ వార్డుకు చెందిన పృధ్వీసాయిశివకుమార్, వీవర్స్ కాలనీకి చెందిన పిచ్చుక ఉదయ్‌కిరణ్, పీచుపాలెంకు చెందిన షేక్ బాజ్జీ, పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన మాలం రవికుమార్‌లను అరెస్ట్ చేశారు. కేసులో ప్రధాన నిందితుడు షేక్ హుస్సేన్ మరో ముగ్గురు కలసి గత నెల 19న పాడేరులో ఒక వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి హుస్సేన్ ఇంటిలోనే భద్రపరిచారు. గంజాయి అమ్మిన పాడేరుకు చెందిన వ్యక్తిని, మరో మైనర్‌ను ఈ కేసులో అరెస్ట్ చేయాల్సి ఉందని ఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి రెండు మోటారు సైకిళ్లు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు హుస్సేన్.. తండ్రి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ మృతి చెందడంతో కారుణ్య నియామకంలో ఉద్యోగం పొందాడు. దురలవాట్లకు బానిసై విధులకు హాజరుకావడం లేదు. ఈ సమావేశంలో నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యు.రవిప్రకాష్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

# దూరంలో ఉన్నా పింఛన్ల అందజేత

**కాళ్ల:** ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తూ వలంటీర్ వ్యవస్థ ఎంతో కృషి చేస్తోంది. ఇంటికి వెళ్లి పింఛను ఇవ్వడమే కాక వారు ఎంతదూరంలో ఉన్నా అక్కడికే వెళ్లి పింఛను సొమ్ము అందిస్తూ మన్ననలు పొందుతోంది. మండలంలోని దొడ్డనపూడి–1 సచివాలయ పరిధిలో వృద్ధాప్య పింఛను లబ్ధిదారుడు వడ్డే వెంకట సుబ్బారావు అనారోగ్యంతో మచిలీపట్నంలో అతని సోదరి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. పింఛన్ తీసుకునేందుకు గ్రామానికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో విషయం తెలుసుకున్న వలంటీర్ చికిలే వెంకటరత్నం మచిలీపట్నం వెళ్లి సుబ్బారావుకు పింఛను సొమ్ము అందజేసి సేవాభావాన్ని చాటాడు. దీంతో సుబ్బారావు, అతని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు వలంటీర్‌ను అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలులోకి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ వల్ల ఎంతోమంది పేదలకు మేలు జరుగుతోందని గ్రామ ప్రజలు, వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు.

**తాడేపల్లిగూడెం నుంచి ఏలూరుకు వెళ్లి..**

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలోని పుల్లాయగూడెం గ్రామానికి చెందిన మేకా సోమయ్య అనారోగ్యం కారణంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి పింఛను సొమ్ము ఇచ్చేందుకు ఇంటికి వెళ్లిన వలంటీర్ మర్లపూడి మల్లిక విషయం తెలుసుకుంది. వెంటనే ఏలూరు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడు సోమయ్యకు పింఛను సొమ్ము అందజేసింది. ఎంపీటీసీ సభ్యుడు మర్లపూడి సుబ్బారావుకు, వలంటీర్ మల్లికకు సోమయ్య కృతజ్ఞతలు తెలిపారు.

**కాకినాడ వెళ్లి..**

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పట్టణంలోని 20వ వార్డు సచివాలయం పరిధిలోని దివ్యాంగ లబ్ధిదారుడు కె.సూరిబాబు అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం పింఛను సొమ్ము ఇచ్చేందుకు వలంటీర్ హేమ హారిక అతని ఇంటికి వెళ్లగా సూరిబాబు ఇంట్లో లేకపోవడంతో స్థానికులను అడిగి విషయం తెలుసుకుంది. అతని చికిత్సకు సొమ్ము అవసరం అని వారు చెప్పగా, వెంటనే కాకినాడకు బస్సులో వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూరిబాబుకు పింఛను సొమ్ము అందజేసింది. ఈ సందర్భంగా వలంటీర్ సేవలను సూరిబాబు కుటుంబ సభ్యులు, సీతారాంపేట ఇన్‌చార్జి రాజా త్రినాథ్, అధికారులు అభినందించారు.



మచిలీపట్నంలో లబ్ధిదారుడు సుబ్బారావుకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీర్ వెంకటరత్నం



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సోమయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మల్లిక, ఎంపీటీసీ సభ్యుడు సుబ్బారావు



ప్రభుత్వ పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ హారిక

### గడపగడపకు సంక్షేమం



పెనుగొండ (ఆచంట) : అయోధ్యలంకలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తూ ఆప్యాయంగా పలుకరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

### వైనాట్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

**తాళ్లపూడి:** వైనాట్ సంస్థ ద్వారా ఖాతాదారులకు వివిధ ప్రాంతాల్లో గత 29 సంవత్సరాలుగా నమ్మకమైన సేవలను అందజేయడం గొప్ప విషయం అని శామ్‌సంఘ్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంపీ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని ప్రక్కిలంకలో గురువారం 29వ వైనాట్ షోరూం నూతన బ్రాంచిని డాక్టర్ జమ్ముల మృదుల, డాక్టర్ భానుప్రసాద్, ఎంపీ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రాంచి ఎండీ జుజ్జవరపు వెంకటరాయుడును పలువురు అభినందించారు. ఎలక్ట్రానిక్ వస్తువులపై పలు ఆఫర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎల్‌జీ బ్రాంచి మేనేజర్ పి.కిషోర్, హైయర్ మేనేజర్ అరవింద, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మానవాళికి రామతత్వం ఆదర్శం

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



**నరసాపురం:** రాముడిని పూజించడమే కాక ఆయన ధర్మాన్ని ఆచరించాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని 7వ వార్డు కుమ్మరవీధిలో 120 ఏళ్ల కోదండ రామాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చాగంటి ప్రవచనాలు వినిపించారు. విష్ణుమూర్తి అన్ని అవతారాల కంటే రామావతారానికి విశిష్టత ఉందన్నారు. మానవాళికి రామతత్వం ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారి గ్రామోత్సవం ఎస్‌ఆర్‌ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, శిరీష దంపతులు, కొవ్వలి కార్తీక్‌నాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులతో, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో సాగింది. కడిమిళ్ల వరప్రసాద్ గురు సహస్రావధాని, ఆలయ కమిటి సభ్యులు కోటిపల్లి దొరయ్య, కోటిపల్లి ఆనందరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## క్లుప్తంగా

### లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం



ఎస్వీఎస్ఎస్ కళాశాలలో లింగనిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అత్తిలి: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు డా.కె నాగరాజు, ఆర్ సురేఖ అన్నారు. గురువారం అత్తిలి ఎస్వీఎస్ఎస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయలు జరిమానా విధిస్తారన్నారు. ఆడపిల్లలను రక్షించు, ఆడపిల్లలను చదివించు కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ గుమ్మడి హరినాథ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందానికి అమ్మాయిలే అని అన్నారు. సీహెచ్‌వో డి మురళి, హెచ్ఈ కేవీఎస్ఎన్ ప్రసన్న, ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ సుధారాణి, డి సూర్యరేఖ, హెల్త్ అసిస్టెంట్ జెఎస్ గనిరాజు, సిహెచ్ భాను, విజయకుమారి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### హరికథకు వన్నె తెచ్చిన యాళ్లబండి



బుద్ధాల దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : సుమధుర గాత్రంతో హరికథకు వన్నె తెచ్చిన మహనీయుడు యాళ్లబండి తాతారావు భాగవతార్ అని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ హరికథా భాగవతార్ యాళ్లబండి తాతారావు సంస్మరణ సభ బుధవారం రాత్రి స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహించారు. ఈ సభకు బుద్ధాల వెంకట రామరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు బుద్ధాల మాట్లాడుతూ యాళ్లబండి తాతారావు తాను హరికథా చెబుతూనే ఎంతోమంది హరికథకులను తయారు చేశారన్నారు. వారి కుమారులు, కుమార్తెలను హరికథకులుగా తీర్చిదిద్దారని చెప్పారు. అనంతరం బుద్ధాల రామారావు దంపతులను యాళ్లబండి తాతారావు కుటుంబ సభ్యులు సత్కరించారు. రాజమండికి చెందిన పురాణ విజయలక్ష్మి భాగవతారిణి 'రుక్మిణి కల్యాణం'' అనే హరికథను వీనుల విందుగా వినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఈతకోట తాతాజీ కర్రి రామచంద్రరావు, యాళ్ళబండి రామకృష్ణ పరమహంస, యాళ్లబండి రామతీర్థ, డాక్టర్ మడభూషి జ్యోతికుమారి, పిటివెంకన్న, దూసనపూడి సోమసుందర్, చింతకాయల బాబూరావు, యర్రా ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

### అలుగులమ్మకు నైవేద్యాలు

ఉండి: చెరుకువాడలో వేంచేసియున్న అలుగులమ్మ అమ్మవారి 104వ వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ముగింపు కార్యక్రమాల సందర్భంగా అమ్మవారికి గ్రామ పెద్దలు, నిర్వాహకులు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే జాతర ముగింపు సందర్భంగా ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అలుగులమ్మ గద్దె వద్ద ఆలయ ప్రాంగణంలో భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అలుగులమ్మ తీర్థప్రసాదాలు స్వీకరించాలని సర్పంచ్ కోరారు. అలాగే ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు నిర్వాహక కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు.

### డంపింగ్ యార్డ్ పరిశీలన

పాలకొల్లు సెంట్రల్: 'కమ్మేస్తున్న డంపింగ్ యార్డ్ పొగ' శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనంతో మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ సారధి స్పందించారు. గురువారం స్థానిక రామయ్య హాలు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. రోడ్డుపై వేసిన చెత్తను చూసి శానిటరీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపల్ రిజర్వ్ స్థలాలు వర్షాకాలం వచ్చిందంటే మునిగిపోతున్నాయని దానివల్ల నీరు బయటకు వెళ్లే మార్గం లేక నీరు నిల్వ ఉండి దుర్వాసన వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల డంపింగ్ యార్డులో ఉన్న మట్టిని వేసి పూడిస్తే రెండు ప్రక్షాళన అవుతాయన్నారు. దీనికి సంబంధించిన ఎస్టిమేషన్ తయారు చేయాలని వారం రోజుల్లో పను ప్రారంభించాలని శానిటరీ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

### వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం : టూటౌన్‌లోని పాతబస్టాండ్ సమీపంలో గురువారం ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని ఎస్సై పి.అప్పారావు తెలిపారు. ఫిట్స్ రావడంతో చేతిలో తాళాలు ఉంచారని స్థానికులు తెలిపారన్నారు. కొద్దిసేపటికి నోటినుంచి నురగలు వచ్చి అతను మృతి చెందాడన్నారు. స్థానికుల సమాచారం ప్రకారం దూబచర్ల వెళ్లే బస్సు కోసం వేసి చేస్తున్నట్లు తెలిసిందని, వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై తెలిపారు.

# సొంతింటి నిర్మాణం చకచకా

- జగనన్న కాలనీల్లో జోరుగా నిర్మాణాలు
- ఉగాదికి గృహ ప్రవేశాలకు సన్నాహాలు



రామచంద్రపురంలో తుదిదశకు చేరిన గృహాలు

పెంటపాడు: ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు జరగాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. తాడేపల్లిగూడెం నియోజక వర్గంలో లేఅవుట్లల్లో నిర్మాణాలు ఊపందుకున్నాయి. పేదలకు సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం పనిచేస్తోంది. దీంతో పాటు, వేసవి దృష్ట్యా పనులకు ఆటంకం ఉండదనే ఉద్దేశ్యంతో లబ్ధిదారులు కూడా నిర్మాణాలు వేగంగా చేస్తున్నారు. నవరత్నాలు – పేదలకు ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా పెంటపాడు మండలంలో 26 లే అవుట్‌ల్లో జగనన్న ఇళ్ల నిర్మాణం సాగుతోంది. ప్రత్తిపాడు, ముదునూరు, బి. కొండేపాడు గ్రామాల్లో ఇప్పటికే 90 శాతం నిర్మాణాలు పూర్తై, గృహప్రవేశాలు కూడా చేసారు. మిగతా గ్రామాల్లో కూడా 50 నుండి 80 శాతం లబ్ధిదారులు లేఅవుట్‌ల్లో నివసిస్తున్నారు. మిగతా ఇళ్లు ఆయా దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, రోడ్లు వంటి సౌకర్యాలను అధికారులు సమకూర్చుతున్నారు. మండలంలో 26 జగనన్న లే అవుట్‌ల్లో 1378 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలను కేటాయించింది. అదేవిధంగా సొంత స్థలాలు ఉన్న 963 మందికి గృహాలు మంజూరు చేశారు. మండలంలో పునాది, బేసిమెంట్, రూఫ్ స్లాబ్ లెవిల్‌లో పూర్తయినవి 819 గృహాలు ఉన్నాయి. కాగా పలు కారణాల వల్ల 563 మంది ఇంకా ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. 989 సొంత స్థలాలకు గాను 904 మంది గ్రౌడింగ్ పూర్తి చేశారు. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ. 6 కోట్లు77 లక్షల 46 వేల 787 సొమ్ము విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాల్లో వేసింది. ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షల లబ్ధిదారునికి అందుతోంది. ఈ నగదును బేసిమెంట్, స్టేజ్, రూఫ్‌లెవిల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక పలు దశల్లో సొమ్ము అందజేస్తున్నారు. సొమ్ము అంతా లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాకు జమ అవుతోంది. సొంత స్థలం ఉన్నవారికి కూడా ప్రభుత్వం గృహనిర్మాణం చేసుకొనేందుకు అవకాశం కల్పించింది.

**గ్రామాల్లో సందడులు:**

జగనన్న కాలనీల పుణ్యామా అని కొత్తగా ఊళ్లకు ఊళ్లు వెలుస్తున్నాయి. ఇళ్లు నిర్మించుకొనే స్తోమతలేని పేదలకు ప్రభుత్వం అండగా నిలవడంతో గ్రామాల్లో సందడి కనిపిస్తోంది. ప్రతి గ్రామంలో ఏదో ప్రాంతంలో ఇంటి నిర్మాణ సామాగ్రి వాహనాలు వెళుతూనే ఉన్నాయి. భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని ఉంటోంది. దీంతో పాటు ఇతర నిర్మాణ సామాగ్రి దుకాణాల్లో కూడా వ్యాపారం జోరుగా సాగుతోంది.

### అద్దెల నుంచి విముక్తి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పేదలకు ఇళ్లు సమకూరుతున్నాయి. ఇప్పటి వరకు ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతి నెలా రూ. 3వేల నుంచి 5 వేలు అద్దె చెల్లించేవారు. సొంతిల్లు ఉంటే ఈ ఇబ్బందులు తప్పుతున్నాయి.

– రాజేంద్రకుమార్, ఏఈ హౌసింగ్ పెంటపాడు

### సమాజంలో గౌరవం



ఇప్పటివరకు సొంతిల్లు లేదనే బెంగ తీరింది. సొంత ఇళ్లు ఉంటే సమాజంలో గౌరవం కూడా పెరుగుతోంది. పేద, మధ్యతరగతి తారత మ్యం లేకుండా అందరం కలిసి ఉంటూ చేదోడు గా ఇంటి పనుల్లో సాయం చేసుకొంటున్నాం. అమ్మఒడి వల్ల ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలు చదువుతున్నారు. కర్చు తగ్గుతుంది. సీఎంకు ధన్యవాదాలు. – బాడిగ వనిత, ముదునూరు జగనన్న కాలనీ

### సంతోషంగా ఉన్నాం



ముఖ్యమంత్రి జగనన్న దయవల్ల సొంతిల్లు నిర్మించి సంతోషంగా ఉంటున్నారు. 36ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంట్లోనే ఉన్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థలం మంజూరు చేయడంతో మేము కష్టపడి ఇళ్లు ఏర్పాటు చేసుకొని సొంతింట్లో ఉంటున్నాం. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– శిరకొండ సమాధానం ముదునూరు

### కుటుంబ నియంత్రణ నియమాలు పాటించాలి

ఇరగవరం: ప్రతి ఒక్కరూ విధిగా కుటుంబ నియంత్రణ పాటించాలను రేలంగి పీహెచ్‌సీ వైద్యులు బంగారు రవి అన్నారు. గురువారం రేలంగి పీహెచ్‌సీలో అయిదుగురికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మన దేశం ప్రపంచ జనాభాలో మొదటి స్థానంలో ఉందన్నారు. పిల్లలు ఎక్కువ మంది ఉండటం వల్ల కుటుంబంలో ఆర్థిక ఇబ్బంది తలెత్తుతాయని పేర్కొన్నారు. ఎక్కువ మంది పిల్లలు ప్రసవించడం వల్ల తల్లులు అనారోగ్యనికి గురౌతారని అన్నారు. పెరుగుతున్నా జనాభాను అదుపు చేయడం కోసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో ప్రసాద్, ఏఎస్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సౌత్ సెక్షన్ పరిధిలో యాగర్లపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు సంబందించి కొబ్బరితోట ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఈ నెల 3 వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టూ టౌన్‌లోని కొబ్బరితోట, యాగర్లపల్లి, రామచంద్రరావుపేట, కృష్ణుడు చెరువు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా ప్రారంభమైన ముళ్లమ్మ ఉత్సవాలు



అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలకు పూజలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: రావిపాడు గ్రామదేవత ముళ్లమ్మ అమ్మవారి మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజలు చేశారు. రావిపాడులో భక్తుల ఇళ్ల వద్ద పాన్పులు వేయించి చలువ వస్త్రాలతో అమ్మవారిని ఘటాలు, ఆసాదుల నృత్యాలు, కావిళ్లతో బెండల్లంక ఆలయం వద్దకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, బి. సత్యనారాయణ, బొచ్చెల వెంకట్రావు మాదాసు వెంకటేశ్వర్లు వల్లూరి బ్రహ్మానందం, దేవరశెట్టి రాంబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాలా గణపతి తదితరులు పాల్గొన్నారు.

**ముళ్లమ్మకు రూ. 1.80 లక్షలతో వెండి కవచం**

బెండల్లంకలో వెలసిన రావిపాడు గ్రామ దేవత ముళ్లమ్మ అమ్మవారికి దాతలు, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో సుమారు రూ.1.80 లక్షల విలువైన 2 కేజీల వెండి కవచాన్ని తయారు చేయించారు. ఈ సందర్భంగా భక్తుల దర్శనార్థం కవచాన్ని ప్రదర్శించారు. ఈ కవచాన్ని దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా అమ్మవారి మూలవిరట్‌కు తొడిగించనున్నట్లు ఆలయ ధర్మకర్త, గ్రామ ఎంపీటీసీ సభ్యుడు బొచ్చెల తాతారావు తెలిపారు.

## మధుమేహం పట్ల అప్రమతతో ఉండండి



మధుమేహ రక్త పరీక్షల శిబిరం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహం పట్ల అప్రమతతో ఉండాలని ప్రింటర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సత్తి ఫణి జగదీష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జనతా ఆసుపత్రి వద్ద గురువారం లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారి ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ రక్త పరీక్షల శిబిరం జరిగింది. జగదీష్ రెడ్డి మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 120 మందికి రక్త పరీక్షలు నిర్వహించి, వారికి రిపోర్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, సభ్యులు ఆదూరి పెద వెంకటేశ్వరరావు, కోశాధికారి చిన్నం జగదీష్, సీనియర్ సభ్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, నిట్ట సుబ్బారావు, ఆంజనేయస్వామి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరిలో సుడిదోమ నివారణ చర్యలు



పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ సిబ్బంది

తణుకు టౌన్: వరి పంటపై సుడిదోమ నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కే కుసుమ చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో ఆమె రైతులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వరి పంట పొలాలను పరిశీలించి వరి పంటలో సుడిదోమ కనిపించినట్లు తెలిపారు. దీని నివారణకు పైమెట్రెడిజెన్ 150 మిల్లీ మందు లేదా పెక్సాలాన్ మందు 200 మిల్లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి 1ఎకరానికి పిచికారి చేయాలని చెప్పారు. పంటలో మిత్ర పురుగులు, శత్రు పురుగుల వివరించారు. రైతులకు ఉపయోగపడే మిత్ర పురుగులకు విష ప్రభావం లేకుండా చూడాలని కోరారు. గ్రామానికి చెందిన రైతులతో పాటు ఏఈవో టీ వీరభద్రరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### రెండు వర్గాల మధ్య ఘర్షణ

తణుకు: తణుకు పట్టణ పరిధిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానిక ఇరగవరం రోడ్డు కాలనీలో జరిగిన ఈ ఘర్షణలో జక్కుల హనోక్, కుంకుళ్ల ప్రసాద్‌లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాత కక్షల నేపథ్యంలో ఈ ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గుదిబండలా వంటగ్యాస్ ధర





పోలీస్ ఐలాండ్ వద్ద గ్యాస్ బండతో సీపీఎం కార్యకర్తలు వినూత్న నిరసన





మాధవరం గ్రామంలో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వంట గ్యాస్ ధరలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. గురువారం పట్టణంలోని స్థానిక పోలీస్ ఐలాండ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించి, గ్యాస్ బండతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ సీపీఎం నాయకులు కరెడ్ల రామకృష్ణ, మడకా రాజులు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న భాజపా ప్రభుత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, ఎ.రామ్మోహనరావు, కె.కొండలరావు, రౌతు వెంకట నాగేంద్ర, పి.నాగేంద్రబాబు, కె.శివాజీ, కె.వీర్రాజు, జి.శివ, సీరుకొండ లక్ష్మి, నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్‌లో : గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం దారుణమని సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి పురిటిగడ్డ జయమ్మ అన్నారు. గ్యాస్ ధరలు పెంపునకు వ్యతిరేకంగా గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ గృహ వినియోగ గ్యాస్‌పై రూ.50లు, వాణిజ్య సిలిండర్‌పై రూ.350లు పెంచడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు గోపాల వెంకట్రావు, మంచాల పాపమ్మ, తానేటి మంగ ఆకుమర్తి చిన్ని, టి.గురుపల్లి కృప, కడిమి కుమారి, కాకులపాటి సావిత్రమ్మ, తానేటి శ్రావణి, కె.ప్రభావతి, కె.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## కులాలు వేరైనా బీసీలంతా ఒక్కటే



బీసీ జన గణనపై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

అత్తిలి: బీసీ కులాలు వేరైనా బీసీలంతా ఒక్కటేనని బీసీ ప్రజాసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. అత్తిలి లయన్స్‌క్లబ్ భవనంలో గురువారం బీసీ ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ జన గణనలో సమగ్ర కుల గణన అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గూడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి, అన్ని బీసీ కులాలు, అన్ని రాష్ట్రాల నాయకులను కలుపుకుని కేంద్రంపై పోరాటం చేస్తున్నామన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి, హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల బీసీసెల్ అధ్యక్షుడు మక్కా సూర్యనారాయణ, బీసీసెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు వర్రిశ్రీనివాస్, సెక్రటరీ పోలవరపు వెంకట సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు చిటకన వెంకట్రావు, బీసీసంఘ నాయకులు రంభ సూరిబాబు, కాసగాని అబ్బులు, కేతా నాగేశ్వరరావు, దాసరి నాగరాజు, మన్యం దానయ్య, కొరిపల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

### వినికిడి పరీక్షలు

సాక్షి, భీమవరం : ప్రపంచ హియరింగ్ డే సందర్భంగా భీమవరం తేజ హియరింగ్ క్లినిక్ లో శుక్రవారం ఉచిత వినికిడి పరీక్షల మెగా క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ కె దుర్గాప్రసాద్ గురువారం విలేకరులకు చెప్పారు. 6 నెలలకు ఒక్కసారైనా వినికిడి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వివరాలకు 93935 32329 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



### 18 నుంచి ఎస్ఆర్‌కేఆర్‌లో వర్క్‌షాప్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 18వ తేదీ నుంచి మూడురోజులపాటు డెవలప్‌మెంట్స్ ఆఫ్ అప్లికేషన్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ వివరాలను వెల్లడించారు. విద్యార్థుల్లో నూతన టెక్నాలజీని అధ్యయనం చేయడం కొత్త సాఫ్ట్‌వేర్స్‌తో అప్లికేషన్ డెవలప్ చేయడం తదితర అంశాలతో వర్క్‌షాప్ ఉంటుందన్నారు. దీంతోపాటు ఈనెల 23వ తేదీన నిర్విరామంగా 24 గంటల పాటు హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



# బాలికల చదువు.. ఇంటికి వెలుగు



తాడేపల్లిగూడెం మండలం మాధవరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: బాలికల చదువు ఇంటికి వెలుగునిస్తుందని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శైలజ అన్నారు. బేటీ పడావో...బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మాధవారం పీహెచ్‌సీ పరిధి 11 గ్రామ సచివాలయాల్లోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శైలజ మాట్లాడుతూ బాలికలు చదువుకుంటేనే కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం కూడా బాలికల విద్యను ప్రోత్సహిస్తుందని, నేడు అన్ని రంగాల్లో బాలికలు ముందు వరుసలో నిలుస్తున్నారన్నారు. కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందించాలని, తద్వారా వారు ఆరోగ్యంగా పెరగడానికి వీలుంటుందన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగిన ఆరోగ్య సమస్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కృపావరం, సూపర్‌వైజర్ రామకృష్ణ, మహిళా కార్యదర్శి లీలా కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దువ్వలో జరిగిన బేటీ బచావో, బేటీ బడావో కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది



కొండేపాడు ప్రాథమికొన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్‌లో : బాలికల సంరక్షణే దేశ సంరక్షణ అని వేల్పూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పర్యవేక్షకులు ఏ.శ్రీరామమూర్తి తెలిపారు. గురువారం బేటీ బచావో బేటీ బడావో కార్యక్రమంలో భాగంగా దువ్వ పీహెచ్‌సీ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణాచార్యులు, ఆరోగ్య సహాయకులు ఎంపీ వెంకట్రావు, ఎంఎల్‌హెచ్‌పీలు జ్యోతి, రూపాదేవి, ఏఎన్ఎంలు సూర్యకుమారి, లక్ష్మీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బేటీ బచావో బేటీ బడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ రాణి, జయరాజు, ఏపీహెచ్ఏ వైటీ మూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ కాపా సుధ, ఏఎన్ఎంలు అనురాధ, హెచ్ఎం సీహెచ్ సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాలికలను సంరక్షించాలి**

పెంటపాడు: ప్రభుత్వం బాలికల సంరక్షణ కోసం ప్రవేశపెట్టిన బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి విజయవంతం చేయాలని కొండేపాడు ప్రాథమికొన్నత పాఠశాల హెచ్ఎం మీసాల శామ్యూల్‌రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చిన్నారి బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ వి. పూజిత ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు చేశారు. రక్తహీనత లోప నివారణకు ఐరన్‌మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఏఎన్ఎం ఎం. నాగవెంకటలక్ష్మి, హెల్త్ సహాయకులు జి. రమేష్, ఎంఎల్‌హెచ్‌పీ ఉమాదేవి, ఆశావర్కర్లు ఎస్. పద్మ, ఎం. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.